# అక్రమ సంపాదన 600 కోట్లు!

- తవ్వేకొద్దీ బయటపడుతున్న నికేశ్‌కుమార్ అక్రమాస్తులు
- సీసీఎస్ మాజీ ఏసీపీ ఉమామహేశ్వరరావుతో కలిసి దందాలు
- బినామీలకు చెందిన 7 లాకర్లు తెరిచిన ఏసీబీ అధికారులు
- రాష్ట్ర చరిత్రలోనే ఏసీబీకి చిక్కిన రెండో అతిపెద్ద అవినీతి అధికారి
- 14రోజుల పాటు రిమాండ్ విధించిన నాంపల్లి కోర్టు



నికేశ్‌కుమార్

హైదరాబాద్ నాంపల్లి డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): లక్ష రూపాయలు లంచం తీసుకుంటూ పట్టుబడిన ముగ్గురు అధికారుల్లో ఒకడు.. నీటిపారుదల శాఖలో ఏఈఈ హేరూర్ నికేశ్ కుమార్. చిన్న అవినీతిగా భావించిన అధికారులకు దిమ్మతిరిగే నిజాలు తెలుస్తున్నాయి. నికేశ్‌కుమార్ ఆస్తుల పుట్టను తవ్వుతుంటే అధికారులు కూడా నివ్వెరపోతున్నారు. రాష్ట్ర అవినీతి నిరోధకశాఖ చరిత్రలోనే రెండో అతిపెద్ద అవినీతి అధికారి హేరూర్ నికేశ్‌కుమార్ అని దర్యాప్తులో స్పష్టంచేశారు. నికేశ్ లంచాలతో కూడబెట్టిన స్థిర, చరాస్తులు మార్కెట్ విలువ సుమారు రూ.600 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా వేశారు. నికేశ్ కుమార్ చెరువులు, జలాశయాల బఫర్ జోన్‌లలో భవన నిర్మాణాలకు అనుమతులు ఇస్తూ వందల కోట్ల రూపాయలు కూడబెట్టినట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. నానక్‌రామ్‌గూడలోని వాసవి అంట్లాటిస్, మైరాన్ విల్లా, బ్లిస్, కంపిల్ ఇన్‌ఫ్రా, సాస్, రాయి చాందనీలలో ఖరీదైన విల్లాలు నికేశ్‌కుమార్ పేరుమీద ఉన్నట్టు తెలిసింది. వీటితోపాటు నార్సింగిలో నాలుగు అంతస్తుల హాస్టల్ భవనం ఉన్నట్టు అధికారులు గుర్తించారు. మొయినాబాద్‌లో ఆరున్నర ఎకరాల్లో మూడు ఫామ్ హౌస్‌లు, తాండూరులో మూడెకరాల వ్యవసాయ భూమి ఉన్నట్టు తెలుస్తున్నది.

### లాకర్లలో ఇంకా ఏముందో!

నికేశ్ కుమార్ ఇంట్లో, బంధువుల నివాసాల్లో కేజీకి పైగా బంగారాన్ని ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కేసును లోతుగా దర్యాప్తు చేస్తున్న అధికారులు ఇవాళ నికేశ్ బినామీలు, బంధువులు, స్నేహితులకు చెందిన ఏడు లాకర్లను తెరవనున్నారు. గతంలో ఏసీబీకి చిక్కిన సీసీఎస్ మాజీ ఏసీపీ ఉమామహేశ్వరరావుతో కలిసి నికేశ్ కుమార్ పలు సెటిల్మెంట్లు చేసినట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. రియల్ ఎస్టేట్‌లోనూ పెద్దపెద్ద పరిచయాలు ఉన్నట్టు తెలుస్తున్నది. మొత్తానికి ఏసీబీ చరిత్రలోనే రెండో అతిపెద్ద ఆదాయానికి మించిన ఆస్తుల కేసుగా భావిస్తున్న ఏసీబీ.. మరికొన్ని అరెస్టులు చేసే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఏసీబీ చరిత్రలో టాప్ 3 కేసుల్లో దేవికరాణీ, నికేశ్ కుమార్, శివబాలకృష్ణగా చెబుతున్నారు.

### తోటి ఉద్యోగులకు వాటాలు

పదేండ్ల క్రితం నీటిపారుదలశాఖలో ఉద్యోగిగా నికేశ్ కుమార్ 2021 నుంచి గండిపేట జోన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. శివారుప్రాంతం కావడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతున్నది. చెరువులు, కుంటల సమీపంలో నిర్మాణాలు చేపట్టేందుకు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ నిబంధనలు ఆటంకంగా ఉండటంతో పెద్ద మొత్తంలో వసూలు చేసి ఎన్‌ఓసీ ఇచ్చేలా డీల్ చేసుకునేవాడు. ఒక్కో ఎన్‌ఓసీకి రూ.50 లక్షల వరకు కూడా వసూలు చేసినట్టు సమాచారం. వసూలు చేసిన మొత్తంలో సగానికిపైగా తాను తీసుకుని మిగిలిన దాంట్లో పైఅధికారులకు వాటాలు ఇచ్చేవాడని తెలుస్తున్నది. కొత్తూరు మండలం సిద్దాపూర్‌లో రూ.2.50 కోట్ల విల్లాను నికేశ్ కొన్నట్టు ఏసీబీ గుర్తించింది. ఇరిగేషన్ విభాగంలో నికేశ్‌తో పాటు పనిచేసే మరో ఐదుగురికి కూడా అక్కడే విల్లాలు ఉండటంతో వారిని కూడా ఏసీబీ విచారించనున్నది. అక్రమంగా సంపాదించిన డబ్బుకు బినామీలుగా ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న తన చిన్ననాటి స్నేహితులను, బంధువులను ఎంచుకున్నట్టు తెలిసింది. అటు ఏసీబీ అధికారులు నిందితుడిని న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించారు.

## ఎన్నికల బదిలీలు వెంటనే చేపట్టాలి

- టెస్రా రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఎన్నికల బదిలీలను వెంటనే చేపట్టాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మూసారంబాగ్‌లోని రెవెన్యూ భవన్‌లో ఆదివారం టెస్రా రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు, డిమాండ్లపై పలు తీర్మానాలు చేశారు. పదోన్నతి పొందిన నాయబ్ తహసీల్దార్లకు సొంత జిల్లాల్లోనే పోస్టింగ్ ఇవ్వాలని కోరారు. మీసేవ, ధరణి రిజిస్ట్రేషన్ల యూజర్ చార్జీలు నేరుగా తహసీల్దారుకు మంజూరు చేయాలని విన్నవించారు. మెడికల్, పెండింగ్ వెహికిల్ బిల్లులతోపాటు ఉద్యోగుల అన్ని బిల్లులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టెస్రా రాష్ట్ర కార్యదర్శి గౌతమ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షులు రాజ్‌కుమార్, రియాజుద్దీన్, ఉపాధ్యక్షులు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

## గ్రూప్-2 పరీక్షపై హైకోర్టుకు

- ఒకే రోజు గ్రూప్-2, ఆర్‌ఆర్‌బీ పరీక్షలు
- గ్రూప్ -2 వాయిదా వేయాలంటున్న అభ్యర్థులు
- సర్కారు పట్టించుకోకపోవడంతో హైకోర్టుకు

హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): ఆర్‌ఆర్‌బీ పరీక్షల నేపథ్యంలో గ్రూప్-2 పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తున్న అభ్యర్థులు ఆఖరుకు న్యాయపోరాటానికి సిద్ధమయ్యారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడం, కనీసం గోడును వినకపోవడంతో గ్రూప్-2ను వాయిదావేయాలని సోమవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు. 7,951 జూనియర్ ఇంజినీరింగ్(జేఈ) పోస్టులను రైల్వేశాఖ భర్తీచేస్తున్నది. బీటెక్, డిగ్రీ అర్హతలున్న వారు ఈ పోస్టులకు పోటీపడొచ్చు. ఇదే బీటెక్ అర్హత గల వారు గ్రూప్-2కు దరఖాస్తు చేసుకున్నారు. అటు గ్రూప్-2, ఇటు ఆర్‌ఆర్‌బీ రెండు పరీక్షలు రాసే వారు 20 మందికి పైగా ఉన్నట్టుగా తేలింది. గ్రూప్-2 పరీక్షలు 15, 16న జరగనుండగా, 16న ఆర్‌ఆర్‌బీ జూనియర్ ఇంజినీర్(జేఈ) పరీక్ష జరగనుంది. ఒకే రోజు రెండు పరీక్షలుండటంతో గ్రూప్-2 పరీక్షలను వాయిదా వేయాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయంపై అభ్యర్థులు ఇటీవలే టీజీపీఎస్సీ చైర్మన్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. అయినా పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తుండటంతో పరీక్ష వాయిదాకు పోరుబాట పట్టాలని నిర్ణయించిన అభ్యర్థులంతా వాట్సాప్ గ్రూపుగా ఏర్పడ్డారు. వీరు సోమవారం హైకోర్టులో పిటిషన్‌ను దాఖలు చేయనున్నారు.

### మొండికి పోయి అన్యాయం చేయొద్దు

గ్రూప్-2 పరీక్షల నిర్వహణపై ప్రభుత్వం మొండికి పోయి మాకు అన్యాయం చేయవద్దు. ఎన్నో ఏండ్ల తర్వాత ఆర్‌ఆర్‌బీ జూనియర్ ఇంజినీర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైంది. ఆరేడేండ్ల తర్వాత గ్రూప్-2 నోటిఫికేషన్ సైతం వచ్చింది. రెండు ముఖ్యమైన పరీక్షలే. దీంతో మేమంతా ఆందోళనలో ఉన్నాం. గ్రూప్-2 పరీక్షలను వాయిదావేయాలని కోరినా పట్టించుకోవడం లేదు. మా గోడు వినడంలేదు. విధిలేని పరిస్థితుల్లో మేం హైకోర్టును ఆశ్రయించాలని నిర్ణయం తీసుకున్నాం.

\- ఆర్ జ్యోతి, పిటిషనర్

## పట్టభద్రులు ఓటు నమోదుచేసుకోండి

- 9 వరకు గడువు: శశిధర్‌రెడ్డి



హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల ఓటరు నమోదుకు 9వ తేదీతో దరఖాస్తు గడువు ముగియనుండటంతో, త్వరగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని బీఆర్‌ఎస్ నేత, మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి సూచించారు. నాలుగు జిల్లాల్లోని 42 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన డిగ్రీ పూర్తిచేసిన పట్టభద్రులందరూ ఖచ్చితంగా ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆదివారం ప్రకటనలో విజ్ఞప్తిచేశారు. మార్చిలో జరిగే ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకొనేలా అందరూ సిద్ధం కావాలని కోరారు.

## పెరిగిన కోడిగుడ్ల ధరలు

- హోల్‌సేల్ రూ.5.90, రిటైల్ రూ.7
- క్రిస్మస్, న్యూఇయర్‌కు మరింత పెరిగే చాన్స్

హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తేతెలంగాణ): ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతుండగా, తాజాగా కోడిగుడ్ల ధరలు అమాంతం పెరిగాయి. హోల్‌సేల్ మార్కెట్‌లో ఒక్కో గుడ్డు రూ.5.90 ఉండగా, రిటైల్‌గా రూ.7 వరకు పలుకుతున్నది. ప్రస్తుతం డజను గుడ్ల ధర బహిరంగ మార్కెట్□లో రూ.80 నుంచి రూ.84 వరకు ఉండడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఈ ఏడాది జనవరిలో ఒక్కో కోడిగుడ్డు ధర రూ.7 వరకు పలికింది. మూడు నెలల తర్వాత.. రూ.3 తగ్గి రూ.4 నుంచి రూ.4.50 వరకు విక్రయించారు. గత నాలుగు నెలలుగా గుడ్ల ధరలు మళ్లీ పెరుగుతూ వచ్చాయి. ఆగస్టులో ఒక్కో గుడ్డు ధర రూ.6 నుంచి రూ.6.50 ఉండగా, నెల క్రితం తగ్గిన గుడ్డు ధరలు మళ్లీ పెరిగాయి. కేసు(30) గుడ్లను కొన్ని ప్రాంతాల్లో 190 నుంచి రూ.200 వరకు విక్రయిస్తుండడంతో.. కేసు గుడ్ల ధర కంటే కేజీ చికెన్ ధర తక్కువగా ఉండటం గమనార్హం. ప్రస్తుతం కేజీ చికెన్ రూ.180 వరకు విక్రయిస్తున్నారు. క్రిస్మస్, న్యూఇయర్ సందర్భంగా కేకుల తయారీకి పెద్దఎత్తున గుడ్లను వినియోగించనుండడంతో వాటి ధర మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

## ఎల్లుండి పరాక్ (న్యాస్) పరీక్ష

- 3,6 9 తరగతుల్లోని విద్యార్థులకు పరీక్ష

హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించేందుకు మూడేండ్లకొకసారి కేంద్రం నిర్వహించే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(న్యాస్) పరీక్ష పేరును కేంద్రం మార్చింది. ఈ ఏడాది ఫెర్ఫార్మెన్స్ అసెస్‌మెంట్ రివ్యూ అండ్ అనాలసిస్ ఆఫ్ నాలెడ్జ్ ఫర్ హోలిస్టిక్ డెవలప్‌మెంట్–రాష్ట్రీయ సర్వేక్షన్–24 (పరాస్) పేరుతో ఈ సర్వేను నిర్వహించనున్నారు. ఈ పరీక్ష జాతీయంగా 4న జరగనుంది. 3,6 9 తరగతుల్లోని విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్ష నిర్వహణ బాధ్యతలను జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి(ఎన్సీఆర్టీ)కి అప్పగించారు. రాష్ట్రంలో ఎంపికచేసిన 3,500 స్కూళ్లల్లో మాత్రమే ఈ పరీక్షను నిర్వహించనున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లల్లో ఉదయం 10:30గంటలకే పరీక్షను ప్రారంభిస్తారు.

## ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయ సంఘం ఆవిర్భావం

హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మోడల్ స్కూల్స్ టీచర్స్ సమస్యలపై ఉద్యమించడానికి మరో ఉపాధ్యాయ సంఘం ఆవిర్భవించింది. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్)కు అనుబంధంగా తెలంగాణ ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయ సంఘం ఏర్పాటైంది. ఆదివారం హైదరాబాద్‌లోని తపస్ కార్యాలయంలో సంఘం ఆవిర్భావ సమావేశాన్ని నిర్వహించారు. మోడల్ స్కూల్స్ టీచర్ల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సంఘం పనిచేస్తుందని తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేశ్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అడ్‌హక్ కమిటీని ప్రకటించారు. కన్వీనర్‌గా డాక్టర్ జే రామకృష్ణ, కో కన్వీనర్లుగా ఎం రజిని, ఉయ్యాల వెంకటేశ్‌గౌడ్, బీ కిరణ్మయి, బీ రమేశ్‌ను ఎన్నుకున్నారు.

## ప్రభుత్వంపై ఆర్టీసీ కార్మికుల అసంతృప్తి

- 5న సచివాలయ ముట్టడికి ఆర్టీసీ జేఏసీ పిలుపు

హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తేతెలంగాణ): ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై ఆర్టీసీ కార్మిక సంఘాలు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి. సోనియాగాంధీ పుట్టిన రోజు నాటికి సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించని పక్షంలో ప్రత్యక్ష పోరాట కార్యాచరణకు సిద్ధమవుతున్నట్టు ప్రకటించాయి. 5న సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించాయి. ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం అంశంతో సంబంధం లేని 11 అంశాలను ముందుగా పరిష్కరించాలని తేల్చిచెప్పాయి. విలీనంతో సంబంధం ఉన్న మరికొన్ని అంశాలను పరిష్కరించాల్సి ఉందని, ఆయా అంశాలపై తీసుకునే నిర్ణయాల్లో కార్మిక సంఘాలను భాగస్వామ్యం చేయాలని డిమాండ్ చేశాయి. సాంకేతిక సమస్యలతో జరిగే చిన్నచిన్న పొరపాట్లకు కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారని, వెంటనే వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈ వెంకన్న, వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి డిమాండ్ చేశారు.

### కార్మిక సంఘాల గుర్తింపే ప్రధాన లక్ష్యం

ఆర్టీసీలో కార్మిక సంఘాల ఉనికి లేదు. వాటి స్థానంలో డిపోల్లో ఉద్యోగుల ఆధ్వర్యంలో సంక్షేమ మండళ్లు ఏర్పాటు చేసి ఆయా అంశాలు మేనేజ్‌మెంట్ దృష్టికి తీసుకెళ్లే బాధ్యతను అప్పగించింది. దీంతో వెంటనే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలన్న లక్ష్యంతో కార్మిక సంఘాలు ఒత్తిడి పెంచుతున్నాయి. కార్మిక సంఘాలకు అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడంతో ఇటీవల ఓ సంఘం సీఎంకు సీఐటీయూ ప్రతినిధుల ద్వారా వినతిపత్రం అందజేయాల్సి వచ్చింది.

## అవి తాత్కాలిక డిప్యూటేషన్లే

- నర్సింగ్ విభాగం డీడీ విద్యుల్లత వెల్లడి

హైదరాబాద్, డిసెంబర్ 1, (నమస్తే తెలంగాణ) : నూతనంగా ఏర్పాటు చేసిన 16 నర్సింగ్ కాలేజీల్లో ఇటీవల భర్తీ చేసిన పోస్టులు తాత్కాలిక డిప్యూటేషన్లు మాత్రమే అని నర్సింగ్ విభాగం డీడీ విద్యుల్లత తెలిపారు. ఆదివారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన 'నర్సింగ్‌లో అక్రమాలు' అనే వార్తకు ఆమె స్పందించారు. డిప్యూటేషన్లలో ఎలాంటి అక్రమాలు జరగలేదని స్పష్టంచేశారు. ఇప్పటికే విద్యార్థులు కాలేజీల్లో చేరుతున్న నేపథ్యంలో కౌన్సెలింగ్ నిర్వహించి సీనియర్లను కేటాయించేంత సమయం లేదని తెలిపారు. అందుకే తాత్కాలిక ప్రాతిపదికన డిప్యూటేషన్లు ఇచ్చామని వెల్లడించారు. ఇవి రెండు మూడు నెలల వరకు మాత్రమే పరిమితం అని చెప్పారు. త్వరలో సీనియర్లను ఆయా కాలేజీలకు శాశ్వతంగా బదిలీ చేస్తామని పేర్కొన్నారు.




















